క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

కాళేశ్వరం: మహదేవపూర్ ఎంపీడీఓగా రవీంద్రనాథ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పలు గ్రామ పంచాయతీల కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను శాలువాతో సన్మానించారు. ఎంపీఓ ప్రసాద్, ఏపీఓ సునీత, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భూమయ్య

మల్హర్: పెద్దపల్లిలో జిల్లాలో నేడు(శనివారం) మంత్రి వివేక్ వెంకటస్వామికి మాలల ఆధ్వర్యంలో సన్మాన సభను నిర్వహిస్తున్నారు. ఈ మేరకు సన్మాన సభ వాల్‌పోస్టర్‌ను మండలంలోని కొయ్యూరు సెంటర్‌లో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి దేవి భూమయ్య శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివేక్ వెంకటస్వామి సన్మాన మహాసభకు మాలలతోపాటు వివిధ దళిత సంఘాల నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. శంకర్, శ్రీకాంత్, లక్ష్మణ్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి ఆత్మీయ సమ్మేళనం..



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రెడ్డి కులబంధువులు

కాళేశ్వరం: మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం కిష్టంపేటలోని బీఎంఆర్ గార్డెన్స్‌లో ఈనెల 10న నిర్వహించే రెడ్డి ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి రెడ్డి కుల బంధువులు తరలిరావాలని మాజీ సర్పంచ్‌లు రాంరెడ్డి, వెన్నపురెడ్డి రవీందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో ఆత్మీయ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరించారు. ఈకార్యక్రమానికి రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్ట శ్రీనివాస్‌రెడ్డి, ప్రముఖ రచయిత్రి తంగెళ్ల శ్రీదేవి హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శనిగరం తిరుపతిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, సుకుమార్‌రెడ్డి, గణపతిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

సన్మానం



సంపత్‌రావును సన్మానిస్తున్న తహసీల్దార్

మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామానికి చెందిన వీరమనేని సంపత్‌రావు ఇటీవల ట్రెస్మా జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. దీంతో శుక్రవారం మండలంలోని తాడిచర్ల తహసీల్దార్ కార్యాలయంలో సంపత్‌రావును తహసీల్దార్ రవికుమార్ శాలువాతో సత్కరించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఏఎస్ఓ శివకృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల పట్టివేత

కాటారం: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వాహనాలను పట్టుకొని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తపల్లి సమీపంలో జేసీబీ ద్వారా లారీలో ఇసుక లోడ్ చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇసుక రవాణాకు సంబంధించి వారి వద్ద ఎలాంటి అనుమతులు లేకపోవడంతో జేసీబీ, లారీని సీజ్ చేసి డ్రైవర్లు, యజమానులపై కేసు నమోదు చేశారు. అలాగే విలాసాగర్ నుంచి భూపాలపల్లికి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను కమలాపూర్ క్రాస్ వద్ద పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండడంతో ట్రాక్టర్ సీజ్ చేసి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి

రేగొండ: పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని నాగుర్లపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై సందీప్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగుర్లపల్లికి చెందిన దుగుణాల బాబురావు (60) కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతుండేవాడు. ఈ నెల 29న నొప్పి ఎక్కువ కావడంతో తట్టుకోలేక పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు పరకాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి, మెరుగైన చికిత్స కోసం ఎంజీఎంకు తరలించారు. కాగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మినీ స్టేడియం కలేనా?

చిట్యాలలో అసంపూర్తిగా స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణం

- పట్టించుకోని అధికారులు, పాలకులు
- ఎదురుచూస్తున్న క్రీడాకారులు



మినీ స్టేడియం నిర్మాణానికి కేటాయించిన స్థలం

చిట్యాల: మండల కేంద్రంలోని బీసీ కాలనీ సమీపంలో స్పోర్ట్స్ మినీ స్టేడియం నిర్మాణం కోసం 2023 సంవత్సరంలో అప్పటి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి శంకుస్థాపన చేశారు. నాలుగు ఎకరాల స్థలం కేటాయించి రూ.35 లక్షల నిధులతో నిర్మాణ పనులను కూడా ప్రారంభించారు. పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ దాదాపు రూ.పది లక్షలకు పైగా ఖర్చు చేసి భూమిని చదును చేసి, మొరం పోసి, చుట్టూ ఫెన్సింగ్ పోల్స్ వేయించాడు. కాని ఇప్పటి వరకు వారికి ఎలాంటి నిధులు రాకపోవడంతో పనులు నిలిపివేశారు. దీంతో గ్రౌండ్ మొత్తం చెత్తా చెదారంతో పాటు అధ్వానంగా దర్శనమిస్తుంది.

క్రీడాకారులకు నిరాశే..

మండల కేంద్రంలో మినీ స్టేడియం ఏర్పాటు అవుతుందని క్రీడాకారుల కల కలగానే మిగిలిపోయింది. వాకర్స్ సైతం నిత్యం మైదానంలో వాకింగ్, రన్నింగ్‌తో పాటు వ్యాయామం చేసుకోవచ్చని అనుకున్నారు. కానీ వారి ఆశలు నిరాశలయ్యాయి. మినీ స్టేడియం విషయంలో పాలకులు అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి స్టేడియం ఏర్పాటు చేయాలని యువకులు కోరుతున్నారు.

స్టేడియం నిర్మించాలి



మినీ స్టేడియం ఉంటే క్రీడాకారులు మండలంలోనే క్రీడలు ఆడుకోవచ్చు. జిల్లా అధికారులు చొరవ తీసుకుని నిధులు కేటాయించి త్వరితగతిన పనులు పూర్తి చేసి స్టేడియాన్ని నిర్మించాలి.

- నేపాలి రాజేశ్, క్రీడాకారుడు



మినీ స్టేడియం నిర్మాణం కోసం శంకుస్థాపన చేసిన శిలాఫలకం

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

- ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ రమాదేవి

రేగొండ: తల్లిపాలు తాగడంతో బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ రమాదేవి అన్నారు. తల్లి పాల వారోత్సవాలలో భాగంగా శుక్రవారం కొత్తపల్లిగోరి మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లి పాలు పిల్లల ఆరోగ్యానికి, ఎదుగుదలకు ఎంత అవసరమో అవగాహన కల్పించారు. తల్లి పాలలో ఉన్న పోషక విలువల గురించి తెలిపారు. మెడికల్ ఆఫీసర్ అస్మా, ఏఎన్‌ఎమ్‌లు అనసూర్య, శారద అంగన్‌వాడీ టీచర్లు రజియా బేగం, ప్రియాంక, సునీత, ఆశవర్కర్లు లలిత, సంగీత పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



మొగుళ్లపల్లి: పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి



కాటారం: పరామర్శిస్తున్న నాయకులు

మొగుళ్లపల్లి: మండలంలోని ఆకినపల్లికి చెందిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదర్శన్ కుమారుడు కిరణ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు గడ్డం శ్రీధర్ తండ్రి ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి శుక్రవారం పరామర్శించారు. అలాగే ఇటీవల రోడ్డుప్రమాదంలో గాయపడిన బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్‌ను పరామర్శించారు. ఆయన వెంట సమ్మయ్య, సతీష్, రాజు, తదితరులు ఉన్నారు.

రేగొండ: కొత్తపల్లిగోరి మండల కేంద్రానికి చెందిన రఘుసాల మల్లయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పరామర్శించారు. రఘుసాల తిరుపతి, పకిడే కిరణ్, దండెబోయిన సంతోష్, శ్రీనివాస్, సూదన బోయిన సుమన్, చేరాలు ఉన్నారు.

కాటారం: మండలంలో చింతకానికి చెందిన రైతు గోల్కొండ పోచయ్య ఇటీవల అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో బాధిత కుటుంబాన్ని ఏఎంసీ చైర్‌పర్సన్ తిరుమలసమ్మయ్య పరామర్శించారు. అలాగే అనారోగ్యంతో చికిత్స పొందుతున్న సారయ్య, రేవెల్లి పద్మ, ఆత్మకూరి ఎల్లయ్యలను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మాజీ సర్పంచ్ ఫిరోజ్‌ఖాన్‌బాబా, మాజీ ఎంపీటీసీ కోసరి భాస్కర్, కాంగ్రెస్ నాయకులు మేడిపల్లి కిరణ్, సత్తయ్య, వెంకటయ్య, సారయ్య, బానయ్య, స్వరూప, రమ ఉన్నారు.

నీచ రాజకీయాలు మానుకోవాలి

- కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

భూపాలపల్లి రూరల్: మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి నీచ రాజకీయాలు చేయడం మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు అంబాల శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి గేదెలను పంపించినట్లు ఆరోపించారు. మంజూర్‌నగర్‌లో గేదెల కొట్టం కూల్చివేయబడిన బాధితుడు కారుకూరి ఓదెలు వెనుక మాజీ ఎమ్మెల్యే అనుచరులే ఉన్నారన్నారు. పాఠశాల దారి కోసం అడ్డంగా ఉన్న కొట్టాన్ని అధికారులు కూల్చివేశారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఎమ్మెల్యే సత్యనారాయణరావుపై ఆరోపణలు చేయడాన్ని ప్రజలు నమ్మరని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు దాట్ల శ్రీనివాస్, పిప్పాల రాజేందర్, అప్పం కిషన్, తోట రంజిత్, బీతి పృధ్వీ, పుల్లమహేష్, తదితర నాయకులు పాల్గొన్నారు.

బీసీ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

భూపాలపల్లి అర్బన్: పార్లమెంట్‌లో 42శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు హరీశ్‌రెడ్డి, యూపీఎఫ్ నాయకుడు సదానందం కోరారు. తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ఈనెల 4 నుంచి చేపట్టనున్న 72గంటల నిరాహార దీక్ష వాల్‌పోస్టర్‌ను జిల్లా కేంద్రంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీ బిల్లును ప్రవేశపెట్టాలని కోరుతూ దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ దీక్షకు బీసీ కులాలు మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బద్దెల వంశీ, శ్రీనాథ్, శివప్రసాద్‌రెడ్డి, వినయ్, వంశీ, దీక్షిత్, రామన్ పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మల్హర్: హనుమకొండలోని జేఎన్‌ఎస్‌లో ఈనెల 3, 4న నిర్వహించే 11వ రాష్ట్ర స్థాయి జూనియర్స్ అథ్లెటిక్స్ 100 మీటర్ల పరుగు పందెం పోటీలకు మండలంలో ఎడ్లపల్లి మోడల్ కళాశాలలోని ఇంటర్మీడియేట్ విద్యార్థి భవాని ప్రసాద్ ఎంపికయ్యాడు. గత నెల 29న నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో భవాని ప్రసాద్ పాల్గొని అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి అర్హత సాధించాడు. దీంతో విద్యార్థిని శుక్రవారం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సీహెచ్ పూర్ణచందర్‌రావు, ఫిజికల్ డైరెక్టర్ పక్కల రాజబాబు అభినందించారు. ఉపాధ్యాయులు సతీశ్, రమేశ్, నాగేశ్వరరావు, సారయ్య, మధుబాబు, కిరణ్, తాజుద్దీన్, రాజేందర్, దేవేందర్, రాజేందర్, ప్రదీప్ విజయలక్ష్మి, లలిత, శైలజ తదితరులు ఉన్నారు.

కొత్త పింఛన్ల దరఖాస్తుకు అవకాశం ఇవ్వాలి

కాళేశ్వరం: కొత్త వృద్ధాప్య, దివ్యాంగుల పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించాలని సీపీఎం మండల అధ్యక్షుడు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పింఛన్లు పెంచుతామని చెప్పి విఫలం అయిందన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని అన్నారు.

ఇద్దరిపై కేసు

కాటారం: మండలంలోని ఇబ్రహీంపల్లికి చెందిన కొండి రాజయ్యపై దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. భూ విషయంలో గత నెల 28న దబ్బెట రాజేశం, అతడి భార్య సరోజన ఇద్దరు రాజయ్యను కర్రలతో దాడి చేశారు. దీంతో కాలు, చేతిపై తీవ్ర గాయాలయ్యాయి. రాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజేశం, సరోజనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పంట పొలాల పరిశీలన



పంట పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

మొగుళ్లపల్లి: మండల పరిధి రంగాపురంలోని పంట పొలాలను తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం వరంగల్ శాస్త్రవేత్తల బృందం శుక్రవారం సందర్శించింది. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ నాగభూషణం మాట్లాడుతూ.. రైతులకు కలుపు నివారణపై పలు సూచనలు చేశారు. అలాగే పంటల సాగుపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త విశ్వతేజ, ఏఓ సురేందర్‌రెడ్డి, ఏఈఓలు రైతులు రాజేశ్వర్‌రావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యుత్‌ను ఆదా చేయాలి



పొలంబాట కార్యక్రమంలో అధికారులు

ఏటూరునాగారం: మండలంలోని రైతులు విద్యుత్ ఆదా చేయాలని విద్యుత్ శాఖ ఏఈ అశోక్ అన్నారు. శుక్రవారం మండలంలోని పప్కాపురం గ్రామంలో పొలంబాట కార్యక్రమాన్ని విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది చేపట్టారు. విద్యుత్ వినియోగం, చార్జీలు, ఉపయోగాలపై ప్రజలకు వివరించారు. విద్యుత్ కనెక్షన్లు, ఇతర విషయాల్లో జాగ్రత్తలు పాటించాలన్నారు. నీటి వినియోగం, విద్యుత్ వినియోగం తగ్గించే మార్గాలను చూడాలన్నారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ కొండ సమ్మయ్య, ఏఎల్‌ఎం మొగిళి, సాయి, రైతులు పాల్గొన్నారు.

పోలీసువా.. కాంగ్రెస్ కార్యకర్తవా?

- అన్యాయాన్ని ఎదిరిస్తే అరెస్ట్ చేస్తావా..
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



భూపాలపల్లి: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి: 'నీవు పోలీసువా.. కాంగ్రెస్ కార్యకర్తవా.. అన్యాయం జరిగిందని నిరసన తెలిపిన ఒక మహిళను అరెస్ట్ చేసి అర్ధరాత్రి 12 గంటల వరకు పోలీస్‌స్టేషన్‌లో ఎలా ఉంచారని' మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ప్రశ్నించారు. భూపాలపల్లి పట్టణంలోని మంజూర్‌నగర్‌లో పాడిగేదెల షెడ్డును మున్సిపల్ అధికారులు కూల్చివేయగా బాధితులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలోకి పాడిగేదెలను పంపి నిరసన తెలిపిన విషయం తెలిసిందే. బాధితులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ దీక్ష చేపట్టగా శుక్రవారం మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి సంఘీభావం తెలిపారు. అనంతరం వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. పాడిరైతు తనకు అన్యాయం జరిగిందని నిరసన తెలిపితే పోలీసులు అరెస్ట్ చేస్తారా అని ప్రశ్నించారు. బాధితురాలు మహిళ అని చూడకుండా బూతులు తిట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అవినీతిపరుడిగా రుజువైన మున్సిపల్ కమిషనర్‌ను బదిలీ చేయిస్తే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇక్కడే పోస్టింగ్ ఇవ్వడంలో ఆంతర్యమేమిటని అన్నారు. కటకం జనార్దన్, నూనె రాజు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యతలేని భోజనం

చిట్యాల: విద్యార్థులకు నాణ్యతలేని భోజనం పెడుతున్నారని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మండలంలోని కస్తూ రిబా గాంధీ పాఠశాల, మోడల్ స్కూల్‌లను బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు జిల్లా గండ్ర జ్యోతితో కలిసి సందర్శించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మోడల్ స్కూల్‌లో, బాలికల హాస్టల్‌లో భోజనం అధ్వానంగా ఉందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్, కేటీఆర్ యువసేనా మండల అధ్యక్షుడు మురహరి తిరుపతి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ట సురేష్, మాజీ జెడ్పీటీసీ గొర్రె సాగర్, పీఏసీఎస్ చైర్మన్ కుంభం క్రాంతి కుమార్‌రెడ్డి ఉన్నారు.

సింగరేణి ఉన్నత పాఠశాల తనిఖీ



పాఠశాలలో మరుగుదొడ్లను పరిశీలిస్తున్న జీఎం

భూపాలపల్లి అర్బన్: ఏరియాలోని సింగరేణి ఉన్నత పాఠశాలను ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని పరిసరాల శుభ్రత, మరుగుదొడ్లను పరిశీలించారు. మరుగుదొడ్లు శుభ్రంగా లేకపోవడంతో సిబ్బందిని పిలిచి మందలించారు. మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని, పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. విద్యార్థుల సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తామని తెలిపారు. టెన్త్ విద్యార్థులు సింగరేణి పాఠశాల, సింగరేణి సంస్థకు మంచి గుర్తింపు తీసుకువచ్చేలా మంచి మార్కులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి

- కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్



ఆస్పత్రి రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్

మల్హర్: ఆస్పత్రి సిబ్బంది సమయపాలన పాటించి మెరుగైన వైద్యసేవలు అందించాలని కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ ఆదేశించారు. మండలంలోని తాడిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ ఆస్పత్రి రికార్డులను పరిశీలించి, మందుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోగులకు ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం నేడు (శనివారం) మంత్రి శ్రీధర్‌బాబు పర్యటన నేపథ్యంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న గ్రంథాలయం, సొసైటీ భవనాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, వైద్యాధికారి రాజు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

అధిక ధరలకు అమ్మితే చర్యలు



నైన్‌పాకలో తనిఖీ చేస్తున్న అధికారులు

చిట్యాల: ఎరువులు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని భూపాలపల్లి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎస్.రమేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని గోపాలపూర్, నైన్‌పాక గ్రామాల్లోని ఎరువుల విక్రయ కేంద్రాల్లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్లు, బిల్లులు, గోదాంలో నిల్వ చేసిన ఎరువుల బస్తాలను పరిశీలించారు. రైతులను ఏలాంటి ఇబ్బందులు పెట్టిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఏఈఓ సమంత్, తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులకు సహకరించొద్దు



ఎస్ఎస్‌తాడ్వాయి : వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి



ములుగు రూరల్: తోపుకుంట వద్ద..



వెంకటాపురం(ఎం): తనిఖీ చేస్తున్న ఎస్సై రాజు



వాజేడులో..

మావోయిస్టులకు ఎవరూ సహకరించకూడదని ములుగు, పస్రా, వెంకటాపురం(ఎం), ఎస్ఎస్ తాడ్వాయి, వాజేడు, పేరూరు ఎస్సైలు వెంకటేశ్వర్ రావు, కమలాకర్, రాజు, తిరుపతిరావు శ్రీకాంత్‌రెడ్డి, జక్కుల సతీష్, గుర్రం కృష్ణప్రసాద్ అన్నారు. మావోయిస్టు వారోత్సవాల్లో భాగంగా జిల్లాలోని ఆయా మండల కేంద్రాల్లో శుక్రవారం వాహనాల తనిఖీ చేశారు. వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి, అనుమానితులను విచారించి వదిలేశారు. ప్రధానంగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి జిల్లాలోకి ప్రవేశించే మార్గాల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సైలు పేర్కొన్నారు. ఎస్పీ శబరీశ్ ఆదేశాల మేరకు తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు.

-సాక్షి, నెట్‌వర్క్